సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 25 । జనవరి । 2024



గిరిజనుల ర్యాలీ

నకిలీ బెంతొ ఒరియాలను గిరిజనుల్లో చేర్చవద్దంటూ పలాసలో బుధవారం గిరిజనులు ధర్నా, ర్యాలీ నిర్వహించారు. మంత్రి సీదిరి అప్పలరాజు సంఘీభావం తెలిపారు. - 10లో



ఆటలు అదరహో..!

ఆడుదాం-ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. విజయమే లక్ష్యంగా క్రీడాకారులు ప్రతిభ చూపారు. - 10లో

జేఈఈ మెయిన్స్ పరీక్ష నిర్వహణ

ఎచ్చెర్ల క్యాంపస్ : చిలకపాలెంలోని శ్రీశివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో బుధవారం జేఈఈ మెయిన్స్ పరీక్ష నిర్వహించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షకు పేపర్-2కు 71 మందికి గాను 66 మంది హాజరయ్యారు. శివానీతో పాటు ఎచ్చెర్ల వేంకటేశ్వర కాలేజీలో జనవరి 31 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి.

అక్కచెల్లెమ్మల మాట

మాట నిలబెట్టుకున్నారు..



మాకు కిరాణా షాపు ఉంది. జగనన్న అందించిన ఆసరాతో డబ్బులు వృథా చేయకుండా మా ఆర్థిక అవసరాలకు అనుగుణంగా కిరణాను షాపు నడుపుతున్నాం. పాదయాత్రలో జగనన్న మాకు మాట ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక తీసుకున్న అప్పులను తీరుస్తామంటూ చేసి చూపించారు. భవిష్యత్ తరాలు బాగుండేందుకు జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ అధికారంలోకి తీసుకువస్తాం.

– ఎ.భవానీ, మోపస్‌బందరు, శ్రీకాకుళం రూరల్ మండలం

ఆనందంగా ఉంది..



ఆసరా డబ్బులతో పాత అప్పులు తీరాయి. కోళ్ల పెంపకానికి కూడా ఈ డబ్బులు ఎంతగానో ఉపయోగపడ్డాయి. గతంలో ఎన్నో ప్రభుత్వాలు మాట ఇచ్చి మోసం చేశాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే ఇచ్చిన మాటను నెరవేర్చారు. మేమంతా సంతోషంగా ఉన్నాం.

– కె.సరోజిని, కళ్లేపల్లి, శ్రీకాకుళం రూరల్ మండలం

రుణపడి ఉంటాం



మొదటి రెండు విడతల్లో ఆసరా పథకం ద్వారా వచ్చిన రూ.13వేలకు మరికొంత డబ్బులు కలిపి పాడి ఆవు కొనుగోలు చేశాను. పాలు అమ్మగా వచ్చిన డబ్బులతో పాటు మూడో విడతగా ఆసరా కింద వచ్చిన డబ్బులు కలిపి పాడి ఆవు కొనుగోలు చేసేందుకు తీసుకున్న అప్పు పూర్తిగా తీర్చేశాను. మాలాంటి ఎంతో మంది పేదలకు అండగా, ఆసరాగా, అన్నగా నిలిచిన జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. మహిళా సంక్షేమానికి కృషిచేస్తున్న ఈ ప్రభుత్వానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం.

– పనుకు సుదీప్త, మేరీమాత స్వయం శక్తి సంఘం సభ్యురాలు, ఎల్.ఎన్.పేట







అతివలకు ఆసరా

వైఎస్సార్ ఆసరా సంబరాలు అంబరాన్నంటాయి. మహిళల ఆనందోత్సాహాలు మిన్నంటాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట నిలబెట్టుకుంటూ వరుసగా నాలుగో విడత ఆసరా నిధులు మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో వాడవాడలా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధుల సమక్షంలో సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేస్తున్నారు.

–శ్రీకాకుళం రూరల్/గార/జి.సిగడాం/పాతపట్నం/నరసన్నపేట/ఎల్.ఎన్.పేట/ఎచ్చెర్ల క్యాంపస్

అక్కచెల్లెమ్మల జీవితాల్లో వెలుగు

రాష్ట్రంలో ప్రతి మహిళను లక్షాధికారిణి చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లక్ష్యం. అందుకే వైఎస్సార్ ఆసరా, చేయూత వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం.

– గొర్లె కిరణ్‌కుమార్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే

(జి.సిగడాంలో జరిగిన ఆసరా కార్యక్రమంలో)

చిత్తశుద్ధితో అమలు

గత ఎన్నికల ముందు డ్వాక్రా సంఘాల రుణాలు మాఫీ చేస్తామని ఇచ్చిన హామీకి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి చిత్తశుద్ధిని చాటుకుంది. మహిళా సాధికారతకు కృషి చేస్తున్నాం.

– రెడ్డి శాంతి, పాతపట్నం ఎమ్మెల్యే

(పాతపట్నం మార్కెట్ యార్డు ఆవరణలో జరిగిన ఆసరా కార్యక్రమంలో)



మాట ప్రకారం..

'ఎన్నికల ముందు మీ రుణం తీర్చేస్తామని చెప్పిన చంద్రబాబు ఎన్నికల సమీపంలో పసుపు కుంకుమ అని కొంతే వేసి మోసం చేశారు. సీఎం జగన్ మాత్రం ఇచ్చిన మాట ప్రకారం మీ రుణం నాలుగు విడతలుగా చెల్లింపు చేశారు.

– ధర్మాన ప్రసాదరావు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి

(గార మండలం అంపోలులో జరిగిన ఆసరా కార్యక్రమంలో...)

రూ.82,500 వర్తించింది



నేను స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. స్వయం సహాయ సంఘాలకు ఇచ్చిన రుణ మాఫీ హామీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయడం ఆనందంగా ఉంది. నాకు రూ.82,500 మేర రుణమాఫీ (ఆసరా) వర్తించింది. ఏటా రూ.16500 చొప్పున నా బ్యాంకు ఖాతాల్లో పడింది. మహిళా సాధికారతకు ప్రభుత్వం చేస్తున్న కృషి ఎప్పటికీ మర్చిపోలేం. మహిళల అభివృద్ధికి, సంక్షేమానికి జగనన్న చేస్తున్న మేలును జీవితాంతం గుర్తుంచుకుంటాం.

– అంపోలు హేమలత, స్వయం సహాయక సంఘ సభ్యురాలు, ఫరీదుపేట, ఎచ్చెర్ల మండలం





మహిళలే మహరాణులు..


వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మహిళలే మహారాణులు. రాష్ట్రంలో ఎందరో ముఖ్యమంత్రులుగా బాధ్యతలు స్వీకరించారు.. ఎవరూ మహిళా సంక్షేమాన్ని పట్టించుకోలేదు. సీఎం జగన్ మాత్రం ఆసరా, చేయూత పథకాలు ద్వారా లక్షాధికారులను చేశారు.- ధర్మాన కృష్ణదాస్, నరసన్నపేట ఎమ్మెల్యే

(పోలాకి మండలం మబగాంలో జరిగిన ఆసరా కార్యక్రమంలో..)

వర్సిటీలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేస్తూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని బుధవారం ఉత్తర్వులు జారీచేశారని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య తెలిపారు. గ్రీవెన్స్‌సెల్ చైర్మన్‌గా సోషల్ వర్కు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యు.కావ్యజ్యోత్స్న, సభ్యులుగా యోగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కంచరాపు తారకరామారావు, తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కళ్లేపల్లి ఉదయ్ కిరణ్, గణితం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.విజయ్‌కుమార్‌లను నియమించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్‌సెల్ పనిచేస్తుందని వివరించారు.

నేడు వైఎస్సార్ సీపీ సమావేశం



నరసన్నపేట, శ్రీకాకుళం (పీఎన్.కాలనీ) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 27న భీమిలిలో పర్యటిస్తున్న సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా స్థాయి సన్నాహక సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు చంద్రమహల్ ఎదురుగా ఉన్న జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య శ్రేణులు హాజరుకావాలని కోరారు.

ఇద్దరు సీఐలకు బెస్ట్ పెర్‌ఫార్మెన్స్ అవార్డులు



అవార్డులు అందుకుంటున్న ఇమ్మాన్యుయెల్ రాజు, సాయి

శ్రీకాకుళం క్రైమ్ : పోలీసు శాఖలో 2023 బెస్ట్ పెర్‌ఫార్మెన్స్ అవార్డుకు ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇమ్మాన్యుయెల్ రాజు, పాతపట్నం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.సాయి ఎంపికయ్యారు. అడిషనల్ డీజీపీ, విశాఖపట్నం కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎ.రవిశంకర్ చేతుల మీదుగా సత్కారం పొంది ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారు. వీరిని ఎస్పీ జి.ఆర్.రాధిక బుధవారం అభినందించారు.

ఓటర్ల దినోత్సవ ర్యాలీ నేడు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో సమావేశం జరగనుందని అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నవజాత శిశువులకు
నవీన రక్షా కవచం





రిమ్స్ ఆసుపత్రిలో నేడు ప్రారంభం కానున్న నవజాత శిశు సంరక్షణ కేంద్రం వార్డు, ఇంక్యుబేటర్లు

- రిమ్స్ ఆస్పత్రిలో ప్రత్యేక సంరక్షణ కేంద్రం
- సీఎం జగన్ చొరవతో ప్రత్యేక యూనిట్ ఏర్పాటు
- రూ.కోటికి పైగా వెచ్చించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఇంక్యుబేటర్ ద్వారా 24 గంటలూ వైద్యం
- నేడు ప్రారంభం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ఖరీదైన వైద్యాన్ని పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అందిస్తున్నారు. పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులను బలోపేతం చేసి అవసరమైన మందులు, వైద్య పరికరాలను సమకూర్చారు. ఈ క్రమంలోనే జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రి(రిమ్స్)లో శిశువుల ఆరోగ్య సంరక్షణకు అధునాతన నవజాత శిశు సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రూ.35లక్షలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయడంతో పాటు రూ.90లక్షలకు పైగా విలువైన పరికరాలను సమకూర్చారు. ఆ యూనిట్‌ను గురువారం ప్రారంభించనున్నారు.



అధునాతన వైద్య పరికరం

తల్లిదండ్రులపై తగ్గనున్న భారం..

- 34 వారాల గర్భధారణ సమయానికి ముందు జన్మించిన శిశువులు, గర్భధారణ వయస్సుతో సంబంధం లేకుండా పుట్టినప్పుడు, 1800 గ్రాముల బరువున్న శిశువులకు ఈ కేంద్రంలో చికిత్స అందిస్తారు.
- దేశంలో ప్రైవేటు ఆసుపత్రుల్లో రోజుకు ఈ వైద్యం కోసం రూ.5వేల నుంచి రూ. 10వేల వరకు ఖర్చు అవుతుంది. ఇప్పుడా ఖర్చు తల్లిదండ్రులకు మిగలనుంది.
- ఇక్కడ ఏర్పాటు చేసిన కేంద్రంలో పూర్తి ఉచితంగా చికిత్సలు అందుతాయి.
- నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో శిశువుల అసెస్మెంట్ గుర్తింపు, ఫొటో థెరపీ, ఆక్సిజన్ థెరపీ, ఇన్‌ఫ్యూషన్‌లు, వార్మర్స్ కేర్, సీపీఏపీ, వెంటిలేటర్ సపోర్ట్, ఎక్స్ఛేంజ్ ట్రాన్స్‌ఫ్యూజన్, ఫ్రీటర్మ్, ఎల్‌బీడబ్ల్యూ బేబీస్ కేర్ వంటి సేవలు అందుబాటులో ఉంటాయి.



3వేలు ప్రసవాలు దాటితే తప్పనిసరి..



సంవత్సరానికి 3వేల కంటే ఎక్కువ ప్రసవాలు జరిగే ఆస్పత్రుల్లో వీటిని తప్పకుండా ఏర్పాటు చేయాల్సి ఉంది. శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో ఏడాదికి 4 వేల వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. ఈ లెక్కన ఎప్పుడో ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉంది. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఇప్పటి వరకు నోచుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజావైద్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో రిమ్స్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. వార్డు నిర్మాణం కోసం రూ.35 లక్షలు, అధునాతన పరికరాల కోసం రూ.90లక్షలకు పైగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెచ్చించింది.

అంతర్జాతీయ ప్రమాణాలతో..

- నవజాత శిశువుల ఆరోగ్య స్థితిని మెరుగుపర్చడానికి అంతర్జాతీయ ప్రమాణాలు, అన్ని సౌకర్యాలతో ప్రత్యేక వార్డును వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.
- 40 ఇంక్యుబేటర్ యూనిట్లతో గురువారం నుంచి క్రిటికల్ కేర్ సేవలు అందించనుంది.
- నవజాత శిశువులు, నెలలు నిండకుండా పుట్టిన శిశువుల ఆరోగ్యం సంరక్షించడమే ఈ యూనిట్ ముఖ్య ఉద్దేశం.
- అన్ని రకాల నియోనేటల్ సేవలు 24 గంటలూ అందనున్నాయి.
- ప్రత్యేక శిక్షణ పొందిన వైద్యులు, స్టాఫ్‌నర్సులు, సహాయక సిబ్బందిని నియమించారు.

ప్రైవేటుకు దీటుగా సేవలు



ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ కేంద్రాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో సర్వజన ఆసుపత్రిలో నెలకొల్పారు. ప్రైవేటు ఆసుపత్రుల కంటే మిన్నగా ఇక్కడ వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాటు చేశారు. అంతే బాధ్యతతో నిర్వహణ చేపడతాం. – డాక్టర్ ముద్దాడ ఈశ్వర్, పిడియాట్రిక్ మెడికల్ ఆఫీసర్

ఏటా 1500 మందికి చికిత్సలు



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఏటా 4 వేల నుంచి 5 వేల వరకు ప్రసవాలు జరుగుతాయి. ఇందులో 1500 మంది వరకు నవజాత శిశువులకు ఇంక్యుబేటర్ ద్వారా చికిత్సలు అవసరమవుతాయి. ప్రత్యేక వార్డు ఏర్పాటు ద్వారా వారందరికీ మేలు జరగనుంది. భవిష్యత్‌లో మరింత మందికి సేవలు అందించేలా విశాల దృక్పథంతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశాం. – డాక్టర్ పి.రాము, నోడల్ ఆఫీసర్, ఎస్.ఎ.ఎన్.సి.యు విభాగం

కిటికీలో తల.. ప్రయాణికుడు విలవిల

- అతికష్టమ్మీద బయటకు తీసిన స్థానికులు



బస్సు కిటికీలో ఇరుక్కున్న సుందరరావు తల

టెక్కలి రూరల్: బస్సు కిటికీలో ఓ ప్రయాణికుడి తల ఇరుక్కుపోవడంతో విలవిల్లాడిపోయాడు. అతికష్టమ్మీద మళ్లీ లోపలకు రావడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. వజ్రపుకొత్తూరు మండలం సుంకర జగన్నాథపురం గ్రామానికి చెందిన గాడి సుందరరావు పలాస నుంచి టెక్కలి వైపు వెళ్లే పల్లెవెలుగు బస్సు ఎక్కాడు. జరపడానికి వీలు లేని ఒక పక్క రేకుతో కప్పేసిన కిటికీ వద్ద కూర్చున్నాడు. టెక్కలి సమీపిస్తుండగా మార్గమధ్యలో తల బయటకు పెట్టి చూసేప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో కిటికీ బయట తల ఇరుక్కుపోయింది. లోపలకు లాగేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. రేకు ఉండటంతో మెడకు గాయమౌతుందని భావించి నెమ్మదిగా లాగేందుకు ప్రయత్నించారు. సుమారు 15 నిమిషాలు ప్రయత్నించినా రాకపోవడంతో డ్రైవర్ బస్సు స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ వద్ద బస్సు ఆపాడు. స్థానికుల సహాయంతో రేకును జాగ్రత్తగా వంచి చాకచక్యంగా బయటకు తీశారు. అనంతరం ఆ వ్యక్తి స్థానికులకు కృతజ్ఞతలు తెలిపి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

29లోగా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పన



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 29లోగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలుగా వినియోగించే భవనాలకు చెందిన శాఖల అధికారులు, ఈఆర్వో, ఏఈఆర్వోలతో బుధవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యుత్ సౌకర్యం, లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, దివ్యాంగుల ర్యాంప్ వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు, వ్యవసాయ, జిల్లా పరిషత్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్, పంచాయతీరాజ్, వివిధ సంక్షేమ శాఖలకు చెందిన భవనాలు ఉన్నందున ఎన్నికల సెక్టార్ ఆఫీసర్లతో పాటు సంబంధిత శాఖల అధికారులు ఆ భవనాలను తనిఖీ చేసి పనులు పూర్తయినట్టు నివేదిక అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డీఆర్వో ఎం.గణపతి రావు, ఉప కలెక్టర్లు జయదేవి, పద్మావతి, వివిధ శాఖల అధికారులు అర్.జయప్రకాష్, బి.శాంతిశ్రీ, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాలికలదే భవిత

జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లాలో పలు విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. బాలికా విద్య ప్రాధాన్యతను ఉపాధ్యాయులు వివరించారు. ఈ సందర్భంగా బాలికా దినోత్సవం ప్రాధాన్యత తెలిసేలా విద్యార్థులు పలు ఆకృతుల్లో ఆకట్టుకున్నారు.

– మందస, కంచిలి



వీరగున్నమ్మపురం పరిధిలోని కేజీబీవీలో ఆకట్టుకున్న నేషనల్ గర్ల్ చైల్డ్ డే అక్షర ఆకృతిలో..



కత్తివరం ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం

క్లుప్తంగా

అంగన్‌వాడీల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న అంగన్‌వాడీలు

సారవకోట: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీలు బుధవారం సంబరాలు చేసుకున్నారు. తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో సారవకోట, జలుమూరు మండలాలకు చెందిన అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వందశాతం విధుల్లో అంగన్‌వాడీలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు వందకు వందశాతం బుధవారం విధుల్లో చేరినట్లు ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ తెలిపారు. అన్ని ప్రాజెక్టుల పరిధిలో 6017 మంది విధుల్లో చేరారని, వీరిలో 3310 మంది కార్యకర్తలు, 2693 మంది ఆయాలు ఉన్నారని, మిగిలిన 14 మంది మెటర్నటీ లీవ్‌లో ఉన్నట్లువివరించారు.

హైదరాబాద్‌లో కొవ్వాడ వాసి మృతి



పోతయ్య(ఫైల్)

రణస్థలం: కొవ్వాడ గ్రామానికి చెందిన మైలపల్లి పోతయ్య(23) హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతయ్య టోపీల వ్యాపారం నిమిత్తం హైదరాబాద్‌లో కుటుంబంతో పాటు నివాసం ఉంటున్నాడు. బుధవారం ఉదయం రోడ్డు పక్కన టోపీలు అమ్మేందుకు బైక్‌పై బయలుదేరి వెళుతుండగా టిప్పర్ లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోతయ్యకు భార్య రాములమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఆర్మీ సుబేదార్ మృతికి సంతాపం



కైలాసరావు భౌతికకాయానికి సెల్యూట్ చేస్తున్న ఆర్మీ జవాన్లు

కొత్తూరు: ఆర్మీ సుబేదార్‌గా పనిచేస్తున్న మెట్టూరుకు చెందిన పెద్దమండి కైలాసరావు (38) బుధవారం తన నివాసంలో అనారోగ్యంతో మృతి చెందారు. జమ్మూకాశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఈయన సెలవుపై స్వగ్రామం వచ్చారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఈయనకు భార్య సంతోషికుమారి, పిల్లలు వరుణ్, నరీన్ ఉన్నారు. కైలాసరావు మృతి చెందడంతో సుబేదార్ హరికృష్ణ, ఆర్మీ జవాన్‌లు గ్రామానికి చేరుకుని సైనిక లాంఛనాలతో దహన సంస్కరణలు నిర్వహించారు.

ఆదిత్యుని సన్నిధిలో ఫైర్ సర్వీసెస్ ఏడీ



జ్ఞానసుందరానికి జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర ఫైర్ సర్వీసెస్ అడిషనల్ డైరెక్టర్ జ్ఞాన సుందరం బుధవారం దర్శించుకున్నారు. ఈయన వెంట జిల్లా ఫైర్ సర్వీసెస్ అధికారి జె.మోహనరావు, అడిషినల్ డీఎఫ్‌వో ఎం.వరప్రసాద్ ఉన్నారు.

ఆటలు అదరహో..!



టెక్కలి: కబడ్డీ పోటీల్లో కోటబొమ్మాళి, నందిగాం మహిళల జట్ల పోరు



ఇచ్ఛాపురం: కబడ్డీ పోటీల్లో క్రీడాకారుల విన్యాసం



టెక్కలి: వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న టెక్కలి, సంతబొమ్మాళి జట్లు



కాశీబుగ్గ: పలాస మైదానంలో వాలీబాల్ క్రీడాకారుల పోరు



కాశీబుగ్గ: పలాసలో ఆడుదాం-ఆంధ్రా పోటీల వద్ద జనసందోహం

ఆడుదాం-ఆంధ్రా పోటీల్లో క్రీడాకారులు అద్భుత ప్రదర్శనలతో అదరగొట్టారు. బుధవారం ప్రారంభమైన నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజయమే లక్ష్యంగా తుదివరకూ పోరాడారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీల్లో నువ్వా-నేనా అన్నట్లు తలపడ్డారు. అంతకుముందు ఈ పోటీలను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు.

– సాక్షి నెట్‌వర్క్

పోలీస్ కానిస్టేబుల్‌పై వేటు

- నిరుద్యోగులకు రూ.24 లక్షల టోకరాపై 'సాక్షి'లో కథనం
- వాస్తవమేనని తేలడంతో తొలగిస్తూ ఉన్నతాధికారుల ఉత్తర్వులు



కోలా రాజు

శ్రీకాకుళం క్రైమ్ : కోర్టులో ఉద్యోగాలిప్పిస్తామని నమ్మబలికి నాలుగేళ్ల క్రితం జిల్లాకు చెందిన నిరుద్యోగుల నుంచి రూ.24 లక్షలకు టోకరా వేసిన పోలీస్ కానిస్టేబుల్‌ను విధుల నుంచి తొలగిస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులిచ్చారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ అంశానికి సంబంధించి గతేడాది జూన్ 6న 'సాక్షి'లో వచ్చిన 'కొలువు పేరిట టోకరా' కథనానికి స్పందించిన ఎస్పీ జి.ఆర్.రాధిక విచారణకు విజిలెన్స్ పోలీసులను ఆదేశించారు. విచారణలో నిజనిర్ధారణ కావడంతో గతేడాది డిసెంబరు మొదటివారంలో విజయవాడలోని ఉన్నతాధికారులకు జిల్లా ఎస్పీ విచారణ నివేదిక పంపించారు. దీనిపై సమీక్షించిన ఉన్నతాధికారులు తొలగింపు ఉత్తర్వులకు ఆర్డర్ వేయడంతో నందిగాంలో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ కోలా రాజును విధుల నుంచి తప్పించారు. 2019ఆగష్టులో ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కోలా రాజు శ్రీకాకుళం రూరల్ మండలంలోని వాకలవలసకు చెందిన కంచరాన పుణ్యవర్ధనరావు, చింతాడ సురేష్, పేడాడ లక్ష్మణరావు, తమ్మినేని మణితేజ, పొందూరు మండలం కింతలికి చెందిన ఎన్ని హేమసుందర్, ఆమదాలవలస మండలం పొన్నంపేటకు చెందిన ఇప్పిలి శశికుమార్‌లను కోర్టులో ఉద్యోగాలిప్పిస్తానని నమ్మబలికి అందరి వద్దా రూ.24 లక్షలకు వసూలు చేశాడు. సంవత్సరం గడిచినా ఉద్యోగాలు రాకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

నకిలీ బెంతో ఒరియాలను గిరిజనుల్లో చేర్చవద్దు



గిరిజనులతో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: బెంతో ఒరియా కులస్తులు శ్రీకాకుళం జిల్లాలో లేరని, నకిలీ బెంతో ఒరియాలను గిరిజనులలో చేర్చవద్దని కోరుతూ బుధవారం గిరిజనులు పెద్ద ఎత్తున పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ర్యాలీ చేపట్టారు. కాశీబుగ్గ పాత జాతీయ రహదారి నుంచి పలాస వరకు ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. మార్గమధ్యలో రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గిరిజనులను మర్యాదపూర్వకంగా కలిసి సంఘీభావం తెలిపారు. గిరిజనులలో ఇతర కులాలను చేర్చడం అనేది ముందు ప్రభుత్వాలు చేసిన ప్రతిపాదనలే తప్ప సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసినది కాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గిరిజన రాష్ట్ర ఉపాధ్యక్షుడు సవర జగన్నాయకులు, జిల్లా జేఏసీ అధ్యక్షుడు సవర రాంబాబు, ప్రధాన కార్యదర్శి జి.అప్పన్న, పలాస ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పి.ఈశ్వరరావు, మందస మండల అధ్యక్షుడు ఎస్.జగన్, గణేష్, లోకనాథం, రామారావు, సిద్దు, కృష్ణారావు, యోగి, లక్ష్మినారాయణ, హేమలత, పోలయ్య, దేవేంద్ర, పురందేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురు చేరిక



పార్టీలో చేరిన వారితో వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్



సోంపేట: విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి చక్రపాణిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న సాయిరాజ్



సోంపేట: కర్తలిపాలెం టీడీపీ కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సాయిరాజ్

నందిగాం: మండలంలోని కొండల ప్రాంతం హర్షబడకు చెందిన పలువురు తెలుగుదేశం కార్యకర్తలు ఆ పార్టీని వీడి శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో బుధవారం చేరారు. పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పలువురు వైఎస్సార్ సీపీకి మద్దతు పలుకుతుంటే తెలుగుదేశం నాయకులు తమ ఉనికిని కోల్పోతామనే భయంతో ఆ పార్టీ వారికే మళ్లీ కండువాలు కప్పి వైఎస్సార్ సీపీ నుంచి వచ్చారని కలరింగ్ ఇస్తున్నారని దుయ్యబట్టారు. టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరినవారిలో బూరే భుజంగరావు, గోవిందరావు, జీవనరావు, నందిగాం గోవిందరావు, ధర్మారావు, జానం కేశవరావు, బూరె భాస్కరరావు, మన్మధరావు, లంక వెంకటరావు, బూరె ఉపేంద్ర, నందిగాం కృష్ణారావు, బూరె క్రిష్టారావు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తమిరె పాల్గుణరావు, కణితి నారాయణమూర్తి, నందిగాం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: మండలంలోని పాలవలస, కర్తలిపాలెం పంచాయతీల్లో పలువురు టీడీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ సమక్షంలో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. పాలవలస పంచాయతీ విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి గుండ్రా చక్రపాణి, మరో పది కుటుంబాల వారు పార్టీలో చేరారు. కర్తలిపాలెంలో కొండూరు చంద్రరావు, మదనాల ముకుంద, వీరార్పు గోవిందరావు, కూర్మార్పు గోవింద్, సన్నశెట్టి వల్లభరావు, సన్నశెట్టి మోహనరావు, మంగి నారాయణ, రెల్ల తుంబనాథం, తామాడ మీనకేశవరావు, చెల్లూరు నారాయణతో పాటు మరో ఇరవై కుటుంబాలు పార్టీలో చేరారు. వీరికి సాయిరాజ్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, మండల పార్టీ అధ్యక్షుడు సిలగాన భాస్కరరావు, జేసీఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, సర్పంచ్‌లు మర్ల హేమలత, పొందూరు గున్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

వంశధార జలాలను ఇచ్ఛాపురానికి తరలించాలి



మాట్లాడుతున్న ఈఏఎస్ శర్మ

కంచిలి: వంశధార జలాలలను ఇచ్ఛాపురం వరకు తరలించాలని రిటైర్డు ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు నియోజకవర్గ రైతు కులం ఆధ్వర్యంలో వంశధార జలాలలతోనే రైతు బతుకులకు వెలుగు అనే అంశంపై కంచిలిలో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. జిల్లాలో వంశధార రెండో ఫేజ్ ఏర్పాటుకు ప్రభుత్వం సంకల్పించిందని, ఇందులో భాగంగా సీఎం జగన్ ఒడిశా ప్రభుత్వంతో రెండుసార్లు చర్చించారని, వారు అంగీకరించకపోవడంతో ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేసి, వంశధార జలాలను తరలించడానికి ప్రతిపాదన చేశారని వివరించారు. ఇది కార్యరూపం దాల్చేందుకు స్థానిక ప్రజాప్రతినిధులద్వారా ఒత్తిడి తీసుకు రావాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, రిటైర్డు డీఎస్పీ శమళ్ల ప్రసాద్, వైద్యులు పి.శివాజీ, వై.కృష్ణమూర్తి, నేతలు నర్తు నరేంద్ర, ఇప్పిలి కృష్ణారావు, మంగి గణపతి, దేశెట్టి దాలిబంధు, కాళ్ల ధర్మారావు, కృష్ణారావు, దట్టి అజయ్, ఇందుగు సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐలకు ఇన్‌స్పెక్టర్లుగా ఉద్యోగోన్నతి



చింతాడ ప్రసాద్



విజయ్‌కుమార్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్లకు ఇన్‌స్పెక్టర్లుగా (సీఐలు) ఉద్యోగోన్నతి కల్పిస్తూ విశాఖపట్నం రేంజి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. శ్రీకాకుళం సైబర్‌సెల్ ఎస్‌ఐ చింతాడ ప్రసాద్, శ్రీకాకుళం రూరల్ ఎస్‌ఐ అంబటి విజయ్‌కుమార్, ఇచ్ఛాపురం రూరల్ ఎస్‌ఐ ఊయిక రమేష్, పొందూరు ఎస్‌ఐ శీలవలస లక్ష్మణరావు, శ్రీకాకుళం డీసీఆర్బీ ఎస్‌ఐ గుబ్బాల శ్రీనివాసరావులు సీఐలుగా ప్రమోషన్ పొందారు.

రథసప్తమి పనుల టెండర్లు ఖరారు



టెండర్ ప్రక్రియ నిర్వహిస్తున్న ఈవో హరిసూర్యప్రకాష్

అరసవల్లి: సూర్యజయంతి (రథసప్తమి) ఏర్పాట్లకు సంబంధించి పనుల టెండర్ల ప్రక్రియ బుధవారం సాయంత్రంతో ముగిసింది. దీంతో వచ్చే నెల 16న జరుగనున్న రథసప్తమి మహోత్సవ ఏర్పాట్లకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఆలయ మండపంలో బుధవారం క్యూలైన్లు, విద్యుత్ అలంకరణ, షామియానా, టెంట్లు వేయడం, రంగులేసే పనులకు వేర్వేరుగా టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్ ఆధ్వర్యంలో శ్రీకూర్మం ఈవో జి.గురునాథరావు పర్యవేక్షణలో క్యూలైన్ల టెండర్‌ను రూ.2.10 లక్షలకు పి.చంద్రమౌళికి, విద్యుత్ అలంకరణ టెండర్‌ను రూ.3 లక్షలకు ఉంగటి పాపారావుకు, షామియానాలు, కార్పెట్లు వేసే టెండర్‌ను రూ.2.60 లక్షలకు కె.గోవింద్‌కు, రంగులేసే కూలీ ఖర్చుల టెండర్‌ను రూ.2.20 లక్షలకు గోపికి ఖరారు చేశారు. నిబంధనల ప్రకారం గతేడాది కంటే తగ్గింపు పాట విధానంలో అర్హులకు టెండర్లు ఖరారు చేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు జలగడుగుల శ్రీనివాస్, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, సిబ్బంది బిఎస్.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. కాగా, తలనీలాల వార్షిక వేలం పాట మరోసారి వాయిదా పడింది. గతేడాది పాట రూ.91 లక్షల కంటే తక్కువగా పాడేందుకు పాటదారులు ప్రయత్నం చేస్తుండగా..ఈ విధానాన్ని అంగీకరించేది లేదంటూ ఈవో వి.హరిసూర్యప్రకాష్ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో శ్రీకూర్మం ఈవో గురునాధరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం



పూలతో ఆర్టీసీ ఉద్యోగులు

శ్రీకాకుళం క్రైమ్ :

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం ఏపీఎస్ఆర్టీసీ కాంప్లెక్సులో డిపో మేనేజర్లు పి.బి.మల్లికార్జునరాజు, కె.ఎస్.ఆర్.శర్మలు బుధవారం డ్రైవర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ప్రతీ డ్రైవర్ సోదరుడు ఎదురుగా వచ్చే వాహనాలను, రహదారి సంకేతాలను గమనిస్తూ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. అనంతరం కాకినాడ ఆదిత్య కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం డ్రైవర్లకు పూలు అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు వెదుళ్ల రమేష్, ఎల్.ఎస్.నాయుడు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర, స్టేషన్‌మాస్టర్ దక్షిణామూర్తి, పర్సనల్ అసిస్టెంట్ మేనేజర్ సెక్యూరిటీ సిబ్బంది, సూపర్‌వైజర్లు, యూనియన్ ప్రతినిధులు డ్రైవర్లు, కండక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 7 వరకు న్యాయవాదులు విధుల బహిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ – 2023కి సంబంధించి న్యాయవాదులు ఫిబ్రవరి 7 వరకు విధులు బహిష్కరించనున్నట్లు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు తెలిపారు. జిల్లా బార్ అసోసియేషన్ భవనంలో బుధవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అడ్వకేట్స్ జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయం మేరకు ఫిబ్రవరి 7 వరకు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. అవుట్ ఆఫ్ ఆర్డర్స్, బిల్స్, షెడ్యూల్ సెషన్స్ ట్రయిల్స్, చెక్ పిటిషన్, ఓల్డ్ సూట్స్‌కు మినహాయింపు ఉన్నట్లు తీర్మానించారు. సమావేశంలో స్టేట్ బార్ అసోసియేషన్ మెంబర్ గేదెల వాసుదేవరావు, జిల్లా బార్ అసోసియేషన్ కార్యదర్శి పొన్నాడ రాము, ఉపాధ్యక్షులు గొంటి చంద్రమోహన్, లైబ్రరీ సెక్రటరీ ఎం.భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఎనిమిదేళ్ల చిన్నారిపై తాతయ్య లైంగికదాడి

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన 70 ఏళ్ల వృద్ధుడు తన మనుమరాలైన ఎనిమిదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక తల్లి బుధవారం టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డికి ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలిక తలిదండ్రులు ఒక ఇంటిలో, తాతయ్య నాన్నమ్మలు కలిసి మరో ఇంటిలో ఉంటున్నారు. ఈ నెల 19న బాలిక తాతయ్య ఇంటికి వెళ్లగా లైంగికదాడికి పాల్పడ్డాడు. తీవ్ర రక్తస్రావమైన బాలిక ఇటీవల అనారోగ్యానికి గురవ్వడంతో బుధవారం చికిత్సనిమిత్తం టెక్కలి ఆస్పత్రికి తీసుకువెళ్లగా విషయం బయటపడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై డీఎస్పీ బుధవారం కొత్తపేటకు వచ్చి విచారణ చేపట్టారు. వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్ అలీ తెలిపారు.

ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ ఎన్నిక

శ్రీకాకుళం కల్చరల్ : రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ జిల్లా శాఖ ఎన్నికలు శ్రీకాకుళంలోని శాంతాకల్యాణ్ అనురాగ నిలయంలో బుధవారం జరిగాయి. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎస్ఆర్ఎస్ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ అధ్యక్షుడిగా కల్లేపల్లి సోమసుందరరావు, గౌరవ అధ్యక్షునిగా బలివాడ మల్లేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా పేడాడ సూర్యప్రసాదరావు, కోశాధికారిగా కె.వెంకటేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి.నరసింహమూర్తి(శ్రీకాకుళం), ఎ.చంద్రశేఖరరావు (బుడితి), ఉపాధ్యక్షులుగా ఎస్ఎస్ సత్యనారాయణ(శ్రీకూర్మం), ఆర్.ఆనందరావు(పాతపట్నం), శశిభూషణ్ పాడి (జలుమూరు), డి.వి.రఘు (నరసన్నపేట), సంయుక్త కార్యదర్శి వి.కనకయ్య(బుడితి), జి.గణపతాచారి, ఎం.లక్ష్మణరావు, బి.జయలక్ష్మీ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.చిన్మయరావు, వి.నాగేశ్వరరావును ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా రౌతు రామమూర్తి, ఆర్.కృష్ణమూర్తినాయుడు, ఎం.సుధాకరరావు వ్యవహరించారు.

విజయమే లక్ష్యంగా భీమిలి సభ



రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా విశాఖ జిల్లా భీమిలిలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల శంఖారావం పూరించనున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బుధవారం ఆమదాలవలస మార్కెట్ యార్డులో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించి సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం బ్రోచర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు, ఎమ్మెల్సీ రఘురాజు, రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ తదితరులు పాల్గొన్నారు.

– ఆమదాలవలస